# జైపాలన్నతోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కన్నీళ్లే..
- బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ ఇంటింటి ప్రచారం



కల్వకుర్తి మున్సిపాలిటీ వడ్డెర బస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కూతుళ్లు



కల్వకుర్తిలోని ఓ సెలూన్‌లో కటింగ్ చేసి ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి/ ఆమనగల్లు/ వెల్దండ, నవంబర్ 26: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తోనే కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. ఆదివారం కల్వకుర్తి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ నాయకులను నమ్ముకుంటే కన్నీళ్లే మిగులుతాయని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాటలు నమ్మవద్దని సూచించారు. మండలంలో జిల్లెళ్ల సర్పంచ్ జంగయ్య ఆధ్వర్యంలో, కల్వకుర్తిలో వడ్డెర బస్తీలో బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ కూతుళ్లు సంగీత, జ్యోతి, వాణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గుండూర్‌లో బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంటింటికీ నీళ్లందించిన పార్టీని గెలిపిద్దాం

ఆమనగల్లు మండలంలోని 13 గ్రామ పంచాయతీలలోని వాడలతో పాటు మున్సిపాలిటీలోని 15వార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు, ప్రజారంజక మ్యానిఫెస్టోను ప్రతి ఓటరుకు వివరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపియాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, కౌన్సిలర్ కమఠం రాధమ్మ, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్, సీనియర్ నాయకులు సాయిలు, గుత్తి బాలస్వామి, కమఠం వెంకటయ్య, జహంగీర్, భీమయ్య, జయరాం, జంతుక అల్లాజీ, దుడ్డు ఆంజనేయులు, పబ్బు పరమేష్, ఎనుమల్ల రమేష్, తోట కృష్ణ, బీఆర్ఎస్ యూత్ వింగ్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వెల్దండలో జోరుగా ప్రచారం

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని వెల్దండ మండల సింగిల్ విండో డైరెక్టర్, కుప్పగండ్ల మాజీ సర్పంచ్ శేఖర్‌ముదిరాజు అన్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కుప్పగండ్ల, చౌదర్‌పల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా గురువారం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కర పత్రాలు పంచిపెట్టారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. వ్యవసాయ పొలాల వద్ద రైతులను కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చొక్కన్నపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెల్దండ ఎంపీటీసీ నిరంజన్, ఆనంద్, శంకర్, ప్రభాకర్, కృపానందం, రాము, అర్జున్, శేఖర్, రవి, బాలరాజు, చంద్రశేఖర్, వెంకటయ్య, ప్రసాద్, ఈదులపల్లి శ్రీనివాసులు, శ్రీకాంత్, రాజు, శివ, వెంకటయ్య, వెంకట్‌ముదిరాజ్, ఎంఎస్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, మల్లయ్య, బాలకృష్ణ, సాయిలు, మట్టపర్వతాలు గౌడ్ పాల్గొన్నారు.



ఆమనగల్లు మున్సిపాలిటీ 11వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహ్మద్ జహంగీర్, కార్యకర్తలు



వెల్దండ: కుప్పగండ్లలో ప్రచారం చేస్తున్న శేఖర్‌ముదిరాజు, బీఆర్ఎస్ నాయకులు

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ట్రస్టు లక్ష్యం

- జెడ్పీటీసీ దశరథ్‌నాయక్




అన్మాస్‌పల్లిలో ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, నవంబర్ 26: మండలంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని కడ్తాల్ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటుబుల్ ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లికి చెందిన మాదాపురం లక్ష్మయ్య చనిపోగా, ఇటీవల డొంక రామకృష్ణ మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ ట్రస్టు తరపున బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నిరుపేదలకు రాధాకృష్ణ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో ట్రస్టు సేవలను మరింత విస్తృత పరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, వార్డు సభ్యులు శ్రీనునాయక్, దేవూలా, నాయకులు రాజు, విష్ణు, శేఖర్, మహేశ్, మల్లేశ్, శ్రీకాంత్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మైసిగండి మైసమ్మ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



మైసిగండి మైసమ్మ ఆలయం

కడ్తాల్, నవంబర్ 26: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మతల్లి జాతర ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఆరు రోజులపాటు నిర్వహించే మైసమ్మ జాతర ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి నిర్వాహకులు రంగులు వేయడంతోపాటు వివిధ రకాల పూలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వివిధ జిల్లాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మైసమ్మ ఆలయ సమీపంలోని శివాలయ, రామాలయం వద్ద కూడా ఏర్పాట్లు చేశామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ శిరోలీపంతూనాయక్, ఈవో స్నేహలత తెలిపారు.

**జాతర కార్యక్రమాలు ఇలా..**

సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకములు, విశేష అలంకరణ, కుంభహారతి, 28న అమ్మవారికి విశేష పూజలు, రాత్రికి పుష్పరథోత్సవం, 29న ఆలయంలో ప్రత్యేక పూజలు, పెద్ద తేరు, 30న విశేష పూజలు, అమ్మవారికి బోనాలు, బండ్లు తిప్పుట, డిసెంబర్ 1న కార్తీక దీపోత్సవం సందర్భమున మహాలింగార్చన, పుష్పార్చన, 2న వివిధ కూరగాయలతో అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో స్నేహలత వివరించారు.

## బీఆర్ఎస్‌తోనే 24గంటల కరెంట్

- మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్



బల్సులపల్లి తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కడ్తాల్, నవంబర్ 26: నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే జైపాల్‌యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని వీరన్నపల్లి, బల్సులపల్లి, కొర్రింతకుంట, గడ్డమీది తండా, గార్మేతండా, గాన్స్యతండాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులు ఆగమైతారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వస్తే వ్యవసాయానికి కరెంటు మూడు గంటలే వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే 24గంటల కరెంట్ ఉంటుందని చెప్పారు. అంతకుముందు ఆయాగ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు.

## ఎన్నికల్లో శాంతియుతంగా వ్యవహరించాలి

- క్రైం అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి



మంగళపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఆమనగల్లు, నవంబర్ 26: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని క్రైం అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో శాంతియుతంగా వ్యవహరించాలని సూచించారు. 30వ తేదీన నిర్వహించే పోలింగ్ సమయంలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఆదివారం మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న గ్రామాల్లో ఆమనగల్లు సీఐ జె. వెంకటేశ్వర్లు పోలీస్ సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ క్రమంలోనే మంగళపల్లిలో ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల వేళ అల్లర్లు సృష్టించిన, పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, రౌడీషీట్ తెరిచి, బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బలరాం, శివప్రసాద్, సత్యనారాయణ ప్రత్యేక బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.